స్కెచ్

# మా తోటలో . . .

నిడదవోలు మాలతి

"ఇదిగో ఇదే ఆఖరు, మరి నీ యిష్టం" అంది, మా అత్తయ్య అయిదో మాటు మొక్క అందిస్తూ. ఇదివరకు నాలుగు మొక్కలు ఆవిడ చేత్తో యిచ్చినవే వయసక్రమంలో భూస్థాపితం చేసేశాం. తగుమాత్రం బాధపడ్డాం కూడాను, అలా జరిగినందుకు. అంచేత యీ వేసంగిలో ఏమైనా సరే దక్షిణగాలి మా సంపెంగ మొక్క మీదుగా వీచాలి అని గట్టిగా నిశ్చయించుకున్నాం. ఎందుకైనా మంచిదని మా బాబు మరొక మొక్క కూడా తెచ్చాడు. రెండు కలిపి నాటాలి, ఒక వేళ చస్తే, యేది చచ్చిందో తెలియకుండా. (రెండూ చస్తే చిక్కే లేదు.)

ఏదైనా Making లో వున్నప్పుడు చూడకూడదు అంటుంది మా అక్క. అందుకే కాబోలు పెద్దవాళ్లు వంటిల్లు మొగవాడికి చూపకూడదు అంటారు. ఏమైనా, "తోటపని" లో నావంతు మటుకు సూపర్ విజన్. ఎప్పుడైనా తోస్తే మాట సాయం చేస్తా. అంతే. గొప్పులు తవ్వడం, నీళ్లు పొయ్యడం, పురుగు పట్టకుండా చూడడం, పట్టీక చూడడం అన్నీ అక్కవంతు. అసలు నిజానికి నాపనే కష్టం అని అమ్మ చెప్తూంటుంది. మరి మా అక్కది కాయకష్టమూ, నాది తలతో పనీను. ఈ సందర్భములో నేను బోలెడు కథలు చెప్పగలను. ఇప్పుడెందుగ్గాని...

మా యింట్లో బొప్పాయిచెట్లు బ్రహ్మజెముడు డొంకలా పెరుగుతాయి, మాకు యిష్టంలేదు కనక. జామిచెట్టు, సన్నజాజి పందిరీ చచ్చినా పెంచలేకపోయాం. కారణం భూసారం అంటుంది అమ్మ. మా అక్క హస్తమ్మీద—చెడ్డ నమ్మకం—మాకు. మొత్తం మీద సంపెంగచెట్టు బాలా ప్రాయంలో బాలారిష్టాలు గడిచి "నూనూగు మీసముల నూత్న యౌవనం" ప్రవేశించేసరికి అయిదేళ్ళు పట్టింది. మా పక్క మామయ్యగారింట్లో కొత్తగా పుట్టిన చిన్నారి పాప అక్షరాభ్యాసం చేసుకుంది. హైస్కూళ్లలో అల్లీ బిల్లీ తిరిగిన నేను యూనివర్సిటీ స్టూడెంటునయాను. మా సంపెంగ మొగ్గ తొడగలేదు. అందరూ—తొడుగుతుంది—అన్నారు. స్వాతి వానకి ముత్యపు చిప్పలు ఎదురు చూస్తాయంటారు. అన్నీ వట్టిదే అంటారు. మేం మటుకు సంపెంగి మొగ్గకోసం పడ్డ ఆవేదన అనుభవైక వేద్యం.

మేం—అంటే మా డియర్ సంపెంగికి దిక్పాలకులం అన్నమాట. మొక్కకి పశ్చిమాన సాయంత్రము వేళ డాబామీదా, అపరాహ్ణంవేళ ఆ పక్కనే వున్న చిన్న గదిలోనూ నా స్థిరనివాసం. పోతే తూర్పు దిక్కున మా "అప్పలమ్మ" దక్షిణ దిక్కున పక్కవాళ్ల "అప్పలమ్మా"— ఓ కన్ను వేసి వుంచారు. మొక్కకి ఉత్తరదిశన కొత్తగా అక్షరాభ్యాసము చేసుకున్న పాప సోల్ మోనార్క్. అటు వేపు మేం ఎవరం చూడరాదు—అన్నది పరా. మొక్క కాలూను వేరు మట్టుకు మా అక్క సంరక్షణంలో సదా వృద్ధి పొందుతోంది.

రోజూ ప్రొద్దున్నే చూసేదాన్ని, అందిన అందిన కొమ్మనల్లా వంచి, యెక్కడా కను చూపు మేరలో—అదే ఆ కొమ్మ చివళ్లలోనే—మొగ్గలాటిదేమీ కనిపించేది కాదు. దేముడు బొత్తిగా లేడు అనిపించింది ఆఖరికి. కాని పసిపిల్లలు ప్రత్యక్ష దేముళ్లు అంటుంది మామ్మ. నిజం కాకపోతే డాబా మీంచి నాకు కనుపించని మొగ్గ ప్రక్క పెరట్లోని పాపకెలా కనిపించింది? ఆ రోజు మా యింట్లో పండుగ చేసు

స్లిప్పర్స్, కళ్ళకి కాటుక, తల్లో సంపెంగ పూలు - ఒకటీ రెండూ కాదుకే నాలుగూ. బస్సెక్కుతుంటే ఎంత గర్వంగా అనిపించిందనీ.........................అదే, అంత గర్వం కూడదు. కాకపోతే ఏమని చెప్పడు? కుంజరయూథం దోమకుత్తుకలో చొచ్చితే ఎలాటి ఫీలింగ్స్ కలిగాయో తెలియదు కానీ, నా సంపెంగి పూలమీద ఒక్క అమ్మాయి అయినా కామెంట్ చెయ్యకపోవడం నాఆత్మ గౌరవానికి గొడ్డలిపెట్టు. అంతకంటె ఘోరం డిపార్ట్మెంట్లో ప్యూన్ అడగడం.

"మీయింట్లో పూసేయాండీ?" — అన్నాడు చింకిచేటంత మొహం చేసుకుని.

"ఊఁ" అన్నాను, మామూలుగా.

"నాకు తెచ్చియ్యరండీ," అన్నాడు మళ్ళీ అదే హాస రేఖలు మొహమ్మీద మెరుస్తూ ఉండగా.

తృళ్ళిపడ్డాను; హైరోడ్ క్రాఫ్ కొట్టించిన ఒకానొక మొగజీవికి సంపెంగపూలెందుకు?

"నువ్వేంచేస్తావు" అన్నాను నవ్వుతూ.

"మా పిల్లకిస్తానండీ" అన్నాడు, వాడు తెగ సిగ్గుపడుతూ.

వెయిటింగ్ రూములో ఆడపిల్లలంతా ఒక్కమారు గొల్లుమన్నారు. నేనింక అక్కడ వుండడం క్షేమంకాదని మెల్లిగా జారుకున్నాను పుస్తకాలు సర్దుకుని.

ఆ సాయంత్రం యింటికొచ్చేసరికి అక్క చేతిలో ఓకార్డుముక్క కనిపించింది. "రేపు పువ్వులు కొయ్యడానికి ఆర్డర్స్ లేవుట — పాప చెప్పింది. ఇది కొత్త అలవాటు మా యింట్లో.

"ఎందుకని?" అన్నాను; కొంచెంగా ఆశ్చర్యపోతూ.

"మా ఫ్రెండ్ కలకత్తా వెళ్తోంది. Station లో కలుసుకోమని వ్రాసింది" అంది, కార్డుతో విసురుకుంటూ.

"దానికి ఫ్లవర్ బొకే, గార్లండూ పట్టుకెళ్తావా?" అన్నాను, హాస్యంగా.

"ఏం పట్టుకెళ్ళకూడదా?" అంది, లాయర్ లాగ.

"నాకేం — పట్టుకెళ్ళు — అసలు పువ్వులు పంపించి, నువ్వు మానెయ్."

"తనకి సంపెంగి అంటే చాలా యిష్టం."

"బాగుంది. సంపెంగి పువ్వులన్నా, 'గొడ్డు ఖారం?'—అన్నా సరదా పడనిదెవరు? నేనూ, అమ్మా తప్పించి." అన్నాను, గుంటూరు ఫ్రెండ్ని తలుస్తూ, అమ్మని చూస్తూ.

"ఊఁ — బాగుందిలే సరసం. కల్లాకపటం లేకపోతే కన్నతల్లితో సరసం ఆడమని." అంది అమ్మ — ఈ వాదోపవాదాలు పండు మిరప కాయల పచ్చడిలాగ అనిపించి.

* * *

మెయిల్ మరో అరగంటకి వస్తుందనగా పువ్వులు Fresh గా కోసి, తడిగుడ్డలో జాగ్రత్తగా చుట్టి పట్టుకెళ్ళాం, నేనూ, అక్కా, ఆ కంపార్ట్మెంట్ వాళ్ళకోసం స్పెషల్ గా వేశారట(!). చుట్టలూ, ముష్టివాళ్ళూ, మురికి గుడ్డలూ — అదే లాస్ట్బోగీ. గాంధీ ఇలాటి పెట్టెల్లోనే ప్రయాణం చేసినట్టు పెద్దవాళ్లు చెప్తుంటే చాలాసార్లు విన్నాను. అప్పట్లో Third class లో ఫాన్స్ కూడా వుండేవి కాదుట. ఎంత కష్టపడి ఉండాలో ఆలోచించు — అన్నారు. పైన చెప్పిన పెద్దవాళ్లు. మరి ఇలాటి సహ — ప్రయాణీకులు ఆ రోజుల్లో ఆయనకి దొరికారా? ఎప్పుడైనా? నేను అడగలేదు. అలా అడగడం అవిధేయతకింద వస్తుంది కదా!

"ఈ సంపెంగిపూల వాసనలు, చుట్టపొగల మధ్య వింతపరిమళం వెదజల్లుతున్నాయి — ఉగాది పచ్చడిలాగ." అంది మా అక్క ఫ్రెండ్.

"లైఫ్ అంటే ఇదేమరి." అంది పైగా. నిజమేననిపించింది నాకు. ఇంతటి గుణపాఠం నేర్పిన మా సంపెంగ చెట్టుకి మనసులోనే ధన్యవాదాలర్పించేను.

పది రోజులు తిరగేసరికి నావైపు కొమ్మలు పూత అయిపోయింది. ఇదికాదు పని అని మా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ కృష్ణపరమాత్మతో చెప్పాను — ముప్పై ఒక్క పువ్వుపూస్తే పదిహేను నాకూ పదహారు తనకీ అని. ఎలా

గైనా భగవంతుడు మంచివాడే. లంచం పుచ్చుకుని పనిచెయ్యనివాళ్ల మాటేమిటి?

సరిగ్గా ముప్ఫై ఒక్క పువ్వు పూసి దేముడు దేముడ్ననిపించుకున్నాడు. కాని అన్ని పురాణాల్లో లాగే ఇక్కడికూడా క్లిక్ పెట్టేడు. గోపాలుడు ఎంతైనా గడుసువాడు. తీరా కొయ్యబోతే సరిగ్గా పదహారు పువ్వులే అందేయి.

"ఇంత 'లేనివాడవై' ఉన్నావేమయ్యా శ్రీకృష్ణా! నీ లీలలు మాలాంటి అల్పులకి అవేద్యం కదా!" అన్నాను, నా పదిహేనూ నేను తీసుకుని, ఒక పువ్వు ఆ బొమ్మ ముందుంచి. మా మామ్మ ఉరిమిచూసింది.

నేను నాస్తికురాల్ని కానని చెప్పినా నమ్మదావిడ.

ఇంతలో డాబామీద ఏదో చప్పుడు వినిపించి, గబగబా పరుగెత్తాను. అనకాపల్లి బాణాకర్రలాటి గడకర్ర ఒకటి తీసుకుని అక్క అక్కడ నిలబడి ఉంది.

"మందారనూనెలో వేసుకోవచ్చు, at lest లేకు నా కొయ్యగలిగితే" అంది నన్ను చూసి.


సరేనని మరోకమాటు మామూలుగా పువ్వు పొళంగా కొయ్యాలని చూశాం. రాలేదు. సరే పూర్తిగా విడిపోతే మర్నాడు చెట్టుఊపి–రాల్చెయ్యొచ్చు అనుకున్నాం. అదీ కుదరలేదు–పైన చెప్పిన గడపకర్ర తీసుకు ని గట్టిగా నొక్కాను తొడిమదగ్గర. మెల్లిగా రేకులమీద కొట్టేను. అటుతర్వాత దానిమీద గట్టిగా కొట్టేను.

"ఏమిటిర్రా! ఏ జన్మలోనో మీరు కిరాతులై పుట్టినట్టున్నారు." అమ్మ కిందనుంచి కేక లేస్తోంది, "సంపెంగ వేడి చేస్తుంది. తలనొప్పి వస్తుంది"........"

ఈ రాక్షస లీల మీద ఏకరుణశ్రీ అయినా మళ్ళీ "పుష్పవిలాపం, పార్ట్ టూ" వ్రాయొచ్చు.

[ మా సంపెంగకి నీరుపోసి, నా రచనకి నారుపోసిన మా అక్కకే ఈ రచన తాలూకు కీర్తి ప్రతిష్ఠలు ధారపోస్తున్నా — రచయిత్రి.]


## 1, 2, 3 భాగములు




ఇందులో 1వ భాగ|| భూమిశిస్తులు, సెస్సులు గల జంత్రీ 2వ భా|| జీతములు. 3వ భా|| యూనిట్లు. 1, 2 భా|| కలిపినవడ్డీ తేలును. ఇదిగాక 1 సెంటు మొదలు 99 వరకు ఎన్నిసెంట్లకైనను, 1 ఎ|| మొదలు 100 ఎ||వరకు ఎన్ని ఎకరములకైనను, 1 నయా పైసా మొదలు 100 రూ|| వరకు భూమి శిస్తులు, లాండ్ సెస్సు వర్షాధిక్యము వలన కలుగు కలావతి ముజరాలు ఎంత? అని ప్రశ్నించినచో ప్రత్యుత్తరము ఒకే మానమునందుదొరుకును.

వెల రు. 4-0-0

బాల సరస్వతీ బుక్ డిపో.,

పి. బి. నెం. 3 కర్నూలు – మద్రాసు-1